క్లుప్తంగా

పీఆర్ డిప్యూటీ ఈఈగా బ్రహ్మం బాధ్యతలు


బ్రహ్మం

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట సబ్ డివిజన్ పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈగా బ్రహ్మం బుధవారం బాధ్యతలు చేపట్టారు. నంగునూరు, సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాలను కలిపి సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు పీఆర్ ఏఈగా పలు మండలాల్లో పనిచేసిన ఆయనకు డిప్యూటీ ఈఈగా బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లను ఇవ్వాలని, స్నానానికి వేడినీళ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. హాస్టళ్లలోకి విద్యార్థి సంఘం నాయకులను అనుమతించకపోవడం సరికాదని వాపోయారు. ఆయన వెంట నరేశ్, సంజు, అఖిల్, భరత్, దినేశ్, రాజు ఉన్నారు.

రాష్ట్ర సంఘంలో సిద్దిపేట వాసులు


ఎన్నికైన సిద్దిపేట వాసులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పద్మశాలీల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో సిద్దిపేట వాసులకు చోటు దక్కింది. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో మంగళవారం నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బూర మల్లేశం, సంయుక్త కార్యదర్శులుగా జోగి భిక్షపతి, మంచె నర్సింహులు, రాష్ట్ర కార్యదర్శులుగా ముదిగొండ శ్రీనివాస్, చేర్యాల మల్లికార్జున్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శ్రీనివాస్ నియామక పత్రాలను అందుకున్నారు.

ప్రజల సహకారం అవసరం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్


ఆస్తిపన్ను వసూలు చేస్తున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: పట్టణంలోని ప్రజలు సకాలంలో ఆస్తి, నల్లా పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక నర్సాపూర్ చౌరస్తాలోని నేషనల్ మార్ట్ షాపింగ్ మాల్ భవన ఆస్తిపన్ను రూ.4.42లక్షలను ఆ యజమాని మంగళవారం చెల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలోని వ్యాపార సంస్థల భవనాలు, నూతనంగా నిర్మించిన భవనాల కొలతల ఆధారంగా ఆస్తి పన్ను నిర్ణయిస్తారని చెప్పారు.

బీజేపీ జెండా ఎగురవేద్దాం

దుబ్బాక: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డులలోను బీజేపీ కౌన్సిలర్లను గెలిపించి కాషాయ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం 38వ బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా బెజ్జంకి వంశీకృష్ణను ఎంపిక చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ యాదవ్, ప్రవీణ్‌కుమార్, రమేశ్‌రెడ్డి, రమణారెడ్డి, సప్తగిరి, అఖిల్ రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ


విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా జ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ హైదర్ పటేల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సతీశ్, పీడీ ప్రవీణ్, ఫౌండేషన్ ప్రతినిధులు గోవర్ధన్ రెడ్డి, నరేశ్, నవీన్, విజయరేఖ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతిపై పట్టింపేదీ..!

● పిచ్చి మొక్కలు.. చెత్తా చెదారం ● పట్టించుకోని అధికారులు

పట్టణాలకు దీటుగా పల్లెల్లో పార్కులు ఉండాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ నిధులతో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. పల్లెల్లో సైతం పార్కులు ఏర్పాటు చేయడంతో ప్రధాన రోడ్ల వెంట ఉన్న పల్లె ప్రకృతి వనాలలో ఎంతో మంది ప్రయాణికులు, పాదాచారులు సేదతీరే వారు. కానీ పల్లె ప్రకృతి వనాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి, చెత్తతో నిండిపోయాయి.


అల్లీపూర్‌లోని పల్లె ప్రకృతి వనంలో చెత్తాచెదారం

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లె ప్రకృతి వనాల్లో కనీసం కూర్చొనేందుకు సైతం అనువుగా లేకుండా పోయాయి. పట్టించుకొనే నాథుడు కరువయ్యాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వనాల్లో మొక్కలు ఎండిపోతున్నాయి. ఒక్కో పల్లె ప్రకృతి వనానికి రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పార్కులు నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల మందు బాబులకు అడ్డాగా మారాయి. అధికారులు స్పందించి పార్కులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకొస్తాం

అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను అందుబాటులోకి తీసుకువస్తాం. కొన్నిచోట్ల వర్షాల వల్ల కొన్ని ప్రకృతి వనాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని పంచాయతీ సిబ్బందితో తొలగింపజేస్తాం. చాలా వరకు పల్లె ప్రకృతి వనాలు వినియోగంలోనే ఉన్నాయి. – జనార్దన్, ఎంపీడీఓ


దంపుయార్డు పక్కనే దర్శనమిస్తున్న చెత్త కుప్ప

చెత్తశుద్ధి ఇదేనా..!

గ్రామంలో చెత్తను సేకరించి దంపుయార్డులో తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టు ఎరువుగా చేయాలన్న లక్ష్యం నిప్పుల పాలవుతోంది. మండలంలోని బస్వాపూర్ గ్రామ సమీపంలో దంపుయార్డు నిర్మించారు. కానీ చెత్తను తీసుకువచ్చి ఓ పాతబావిలో పడేసి నిప్పు పెడుతున్నారు. దీంతో చెత్తశుద్ధిపై లక్ష్యం నీరుగారుతోందని స్థానికులు వాపోతున్నారు. – జగదేవ్‌పూర్(గజ్వేల్):

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


మాట్లాడుతున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, దుకాణ సముదాయ భవన నిర్మాణాలకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, సీఈఓ రాజు, డైరెక్టర్లు రాజిరెడ్డి, పరశురాములు పాల్గొన్నారు. అనంతరం భూంపల్లికి చెందిన శ్రీరాంస్వామి, కుర్మ రాజయ్య, దొమ్మాట రమేశ్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రభాకర్, శ్రీనివాస్, కిషన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరారెడ్డిపల్లి, జంగపల్లి గ్రామాల శివారులో వెలసిన మల్లన్న బండ ఆలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బండపైకి భక్తులు చేరుకోవడానికి వీలుగా అధికారులతో మాట్లాడి సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన లింగాల వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులను ఆయన సన్మానించారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి

ఏఓ శ్రీనాథ్


నాట్లువేస్తున్న పొలాన్ని పరిశీలిస్తున్న శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: వరి నాట్లువేసే సమయంలో ఎరువుల వినియోగం, కలుపు యాజమాన్యంపై శ్రద్ధ వహిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. బక్రిచెప్యాల గ్రామంలో వరినాట్లు వేస్తున్న పొలాలను మంగళవారం పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసారాన్ని బట్టి రసాయన ఎరువుల మోతాదు నిర్ణయించి నత్రజని, భాస్వరం, పొటాష్, జింకు వంటి ఎరువులను వాడుకోవాలన్నారు. నాలుగు నుంచి ఆరు ఆకులు ఉన్న నారును ఉపయోగించాలని, ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుందని చెప్పారు. ప్రతి రెండు మీటర్లకు 20సెం.మీ కాలి బాటలు వదులుకోవడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతిని తగ్గించవచ్చని చెప్పారు. వరి రకాన్ని బట్టి కుదుళ్ల సంఖ్యను నిర్ధారించుకోవాలని, భూసారం ఎక్కువ ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, భూసారం తక్కువ పొలాల్లో ఎక్కువ కుదుళ్లు ఉండేటట్టు నాటుకోవాలని సూచించారు. ఏక వార్షిక గడ్డిజాతి కలుపు నివారణకు బ్యూటాక్లోర్ 50శాతం మందును 1 నుంచి 1.5లీటర్ల నీటిలో లేదా అనిలోఫాస్ 30 శాతం మందును 500మి.లీ లేదా బెంథియోకార్బ్ 50శాతం మందును 1.5 నుండి 2లీటర్ల మందులో ఏదో ఒక దానిని ఎకరాకు 25కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన మూడు రోజుల నుంచి 5రోజులలో పలుచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లుకోవాలని సూచించారు. గడ్డి, తుంగ, వెడల్పాటి ఆకు సమపాళ్లలో ఉన్నప్పుడు బ్యూటాక్లోర్ 5శాతం గుళికలను 20కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుంచి 5రోజుల్లో వాడుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని బండారుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లను ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌తో కలిసి సొసైటీ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు 17 కేంద్రాల ద్వారా 2,440 మంది రైతుల నుంచి 97వేల క్వింటాళ్ళ ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు వరి కొయ్యలను కాల్చొద్దని, కలియ దున్నితే చాలా లాభాలున్నాయని ఏఓ వసంతరావు అన్నారు. మండలంలోని అనంతసాగర్‌లో మంగళవారం రైతులకు వరి కొయ్యలపై అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కలియ దున్నితే ఎరువుగా మారుతుందన్నారు. ఆయన వెంట ఏఈఓ కిరణ్ ఉన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి

సిద్దిపేటరూరల్: ఎలాంటి ఆదేశాలు లేకుండా అక్రమంగా పట్టాలు జారీ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పుల్లూరుకు చెందిన నర్సింహులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. 2016 నుండి 2024వరకు మండల రెవెన్యూ కార్యాలయం జారీ చేసిన పీఓటీ రీ అసైన్‌మెంట్, అసైన్‌మెంట్ భూములకు ఇచ్చిన పట్టా సర్టిఫికెట్‌లపై ఎలాంటి ఆర్ఐ పంచనామా లేదన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు రాయితీలు

వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా


అవగాహన కల్పిస్తున్న తస్లీమా సుల్తానా

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా అధ్యక్షతన ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ ద్వారా ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎకరాకు 50 మొక్కలను ఇస్తుందన్నారు. అదేవిధంగా సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందజేస్తోందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటగా శనగ, ఉల్లి, మునగ, వంకాయ, మిర్చి, చిక్కుడు, టమాటా వేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి బాలాజీ, వ్యవసాయ విస్తరణాధికారి విజయ్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం

దుబ్బాకటౌన్/మద్దూరు(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను విడుదల చేయాలని ధర్నాకు వెళ్తున్న పంచాయతీ కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని రాయపోల్ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకుడు నర్సింహులు, బాబు డిమాండ్ చేశారు. రాయపోల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వారు మాట్లాడుతూ ధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చి అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నాగరాజు, యాదగిరి, నర్సింహులు పాల్గొన్నారు. మద్దూరులో కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేణు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ధర్నాకు వెళ్తున్న లక్ష్మణ్, వినోద్, శివ తదితరులను బెజ్జంకి పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల వినతి


మద్దూరు(హుస్నాబాద్): తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలసి స్థానిక తహసీల్దార్ రహీమ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పి ఇప్పుడు మెతక వైఖరి అవలంబిస్తోందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుమలత, భాస్కర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్, కృష్ణవేణి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా కలిసి రావాలి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఉద్యమంలో పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు పిలుపునిచ్చారు. స్థానిక పంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్, టీడీపీ, సీపీఎం నాలుగు మండలాల నాయకులు జేఏసీ చైర్మన్‌గా నర్సయ్య పంతులును ఎన్నుకున్నారు.

కేసులు ఎత్తివేసే వరకు పోరాటం

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ● పలుచోట్ల నిరసన కార్యక్రమాలు ● అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు

లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిరసనలు వెల్లువెత్తాయి. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణాలు, మండల కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ లగచర్ల రైతులపై అక్రమ కేసులను ఎత్తి వేసేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు.


మద్దూరులో వినతిపత్రం అందజేస్తున్న సంతోష్‌కుమార్


అక్కన్నపేట అంబేడ్కర్ చౌరస్తాలో..


దుబ్బాకటౌన్: చెల్లపూర్‌లో..


బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో..

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్


2కే రన్ విజేతలతో ఎస్ఐ పరశురాములు

మిరుదొడ్డి(దుబ్బాక): దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని ఎస్ఐ బోయిని పరశురాములు అన్నారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అల్వాలలో 2కే రన్ నిర్వహించారు. రన్‌లో విన్నర్లుగా నిలిచిన యువత, చిన్నారులకు ఆయన మెడల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలను గ్రామాల్లోకి రానీయకుండా కట్టడి చేయాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి రాజు, మల్లేశం, దేవరాజు, పోలీస్ రాజులు, సూకూరి లింగం, వల్లాల సత్యనారాయణ, బాల్‌రాజు, కిష్టయ్య, దిలీప్‌రెడ్డి, ఎండీ అహ్మద్, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజన్న అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌కు ఇంటర్మీడియట్ తొలిమెట్టు అని, పిల్లలపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రయోజకులుగా మారతారన్నారు.

◆ **మట్టి తరలింపు అడ్డగింత**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని వంగపల్లి గ్రామంలో ఎల్లమ్మకుంట నుంచి మట్టి తరలింపును ఇరిగేషన్ ఏఈ సతీశ్, ఆర్ఐ రమేశ్, పోలీసులు అడ్డుకున్నారు. వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతూ అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీటీసీ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ధర్నాకు తరలిరండి**



వర్గల్(గజ్వేల్): తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరగనున్న చలో ఇందిరాపార్కు ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ గజ్వేల్ డివిజన్ జాయింట్ సెక్రెటరీ చంద్రం యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం గౌరారం సెక్షన్ అధ్యక్షుడు సతీశ్, నాయకులు శ్రీనివాస్, కనకయ్యతో ఆయన మాట్లాడారు.

◆ **బాలసాహిత్యంపై కార్యాశాల**

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక ఉన్నత పాఠశాలల్లో శ్రీవాణి బాలసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం బాలసాహిత్య కార్యాశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కవి వెంకటేశ్వర్లు విద్యార్థులకు బాలసాహిత్యంపై అవగాహన కల్పించారు. కవితలు, కథలు రాయించి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **పేదలకు అండగా ఉంటాం**

మిరుదొడ్డి(దుబ్బాక): పేద బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన కుమ్మరి రాజు కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించారు. కనకయ్య, మల్లేశం, మల్లయ్య, రాములు, చంద్రకుమార్, సంజీవ్, రాజు తదితరులు ఉన్నారు.

◆ **రజక మహాసభ పోస్టర్ ఆవిష్కరణ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేశ్ పిలుపునిచ్చారు. మహాసభల పోస్టర్‌ను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి సిద్దిపేటలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 29న జనగామలో మహాసభలు జరుగుతాయన్నారు. భిక్షపతి, రమేశ్, స్వామి, వేణు, సురేశ్ పాల్గొన్నారు.

◆ **అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్ మాకొద్దు**

గజ్వేల్‌రూరల్: అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యే కేసీఆర్ తమకొద్దని గజ్వేల్ యువజన కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ కేసీఆర్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారని, ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సుదర్శన్, మల్లేశ్, వంశి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్**

దుబ్బాకటౌన్: విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే ప్రతి సంవత్సరం లచ్చపేట మోడల్ స్కూల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు చెప్పారు. పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు సుమయ, దీపక్, అక్షయను డిసెంబర్ 30న మండల స్థాయిలో నిర్వహించే పరీక్షకు సిద్ధం చేస్తామన్నారు. నరేశ్, మదన్ మోహన్ తదితరులున్నారు.

◆ **క్రీడా పరికరాల అందజేత**

చేర్యాల(సిద్దిపేట): కడవేర్గు ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన జల్లి రమేశ్ రూ.1.20లక్షల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. రమేశ్ కుమారుడు సంయుక్త్ పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ రచ్చ కిష్టయ్య మాట్లాడారు. దాతలు ముందుకు వచ్చి మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. అదనపు సెక్టోరియల్ అధికారి భాస్కర్, పుష్ప, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.